# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 20-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ శ్రేయస్సు, అభివృద్ధికి స్వావలంబన ఎంతో కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ దేశ పౌరుల ప్రయోజనం కోసం జీఎస్టీ స్లాబ్‌లను సంస్కరించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
- ❖ "చలో జీతే హై" లఘు చిత్రాన్ని దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రదర్శించాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28న ప్రసారమవుతుంది.

===================

దేశ శ్రేయస్సు, అభివృద్ధికి స్వావలంబన ఎంతో కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గుజరాత్ లోని భావ్‌నగర్‌లో సుమారు 34 వేల 200 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం 'సముద్ర సే సమృద్ధి' కార్యక్రమంలో నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ... భారతదేశం విదేశాలపై ఆధారపడటం దాని అతిపెద్ద శత్రువులలో ఒకటి అని పేర్కొన్నారు. దేశాన్ని సముద్ర సూపర్ పవర్‌గా మార్చాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఓడరేవు విధానాలను సరళీకృతం చేసే లక్ష్యంతో త్వరలో ఈ రంగంలో "ఒక దేశం, ఒక ఓడరేవు విధానం"ను తీసుకురానున్నట్టు ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

===================

దేశ పౌరుల ప్రయోజనం కోసం జీఎస్టీ స్లాబ్‌లను సంస్కరించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈరోజు తమిళనాడు టుటికోరిన్‌లోని కోవిల్‌పట్టిలో జరిగిన అగ్గిపుల్లలు, బాణసంచా తయారీ సంఘాల శతాబ్ది ఉత్సవాలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, వికసిత్ భారత్ 2047 దార్శనికతతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బాణసంచా, అగ్గిపుల్లల తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. జీఎస్టీ స్లాబ్ ల మార్పు ఈ నెల 22వ తేదీ నుండి అమలులోకి రానుందని, దీంతో ప్రజలు అతి తక్కువ ధరకు వస్తువులను కొనుగోలు చేయగలరని మంత్రి తెలియజేశారు.

==================

“చలో జీతే హై” లఘు చిత్రాన్ని దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రదర్శించాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినం సందర్భంగా ఆయన బాల్యానికి సంబంధించిన ఇతివృత్తంతో నిర్మించిన “చలో జీతే హై” లఘు చిత్రం ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు థియేటర్లలో ప్రదర్శించబడుతుంది. ఈ లఘు చిత్రానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈనెల 17న ప్రారంభమైన ఈ చిత్ర ప్రదర్శన 24వ తేదీ వరకు కొనసాగుతుంది.

==================

వస్తు సేవల పన్ను (GST) తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు నేరుగా అందించే ప్రయత్నంలో భాగంగా రైల్వే మంత్రిత్వ శాఖ రైళ్లు, రైల్వే ప్రాంగణాల్లో లభించే ప్యాకేజ్డ్ తాగునీటి MRPని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దీనితో రైల్ నీర్, ఇతర ప్యాకేజ్డ్ తాగునీటి బాటిళ్ల ధర లీటరుకు 15 రూపాయల నుండి 14 రూపాయలకు తగ్గుతుంది. అదే విధంగా, 500 మిల్లీలీటర్ బాటిళ్ల ధరలను 10 నుండి 9 రూపాయలకు తగ్గించారు. ఈ నెల 22 నుండి సవరించిన ఈ ధరలు అమలులోకి రానున్నాయి.

==================

అహ్మదాబాద్-ముంబై బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ మొదటి దశ 2027 నాటికి అందుబాటులోకి రానుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. నవీ ముంబైలోని ఘన్సోలి - షిల్ఫాటాల మధ్య ఉన్న సొరంగాల పురోగతిని ఆయన ఈరోజు సమీక్షించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ మెథడ్ (NATM) ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టులో ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. ప్రాజెక్ట్ థానే విభాగం 2028 నాటికి, బాంద్రా కుర్లా కాంప్లెక్స్ వరకు ఉన్న విభాగం వచ్చే ఏడాదికి పూర్తవుతుందని తెలియజేశారు. ఈ ప్రాజెక్ట్‌లో దేశీయంగా అభివృద్ధి చేసిన అనేక పరికరాలు, సాంకేతికతను వినియోగిస్తున్నామని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

విరామం

==================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. “సేవా పర్వ్” పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం తీసుకొచ్చిన పలు కార్యక్రమాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 120 సెకన్లు)

==================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

===================

GST సంస్కరణల ఫిర్యాదుల పరిష్కారానికి కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ ను ప్రారంభించింది. సవరించిన GST రేట్లు సోమవారం నుండి అమలులోకి వచ్చిన తర్వాత, వినియోగదారుల నుండి వచ్చే ప్రశ్నలు, ఫిర్యాదులను పరిష్కరించడానికి ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రిడ్రెసల్ మెకానిజం (INGRAM) పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్ ప్రారంభించినట్లు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

===================

మహిళల మూడు వన్‌డే ల సిరీస్ లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య చివరి వన్ డే మ్యాచ్ ఈరోజు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతోంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 47.5 ఓవర్లలో 412 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 33 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది.

===================
===================